

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంచిక : 5 సంపుటి : 9 పుష్పం : 34-38 5-6-2000

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 24

**VOL: 5 ISSUE: 9**

CHIEF EDITOR
**P. S. RAMA RAJU**

EDITOR
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 125

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438


## సందేశం

లౌకిక విద్యలు తిండికి బట్టకు ఉపయోగపడతాయి..
ఆత్మ విద్య మోక్షాన్ని ప్రసాదిస్తుంది.

-- సద్గురు శ్రీ నాన్నగారు

## పాఠకులకు మనవి

గత ఐదు సంవత్సరాలుగా రమణభాస్కర ద్వారా సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనములను అందిస్తూ కరపత్రాల నుండి పక్షపత్రికగా స్థాయిని పెంచి చేస్తున్న కృషికి మీరిస్తున్న సహకారంతో ముందుకు సాగుతుంది. మీ అభిప్రాయాలు, సూచనలు యిచ్చి ఈ పక్షపత్రిక మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని మిమ్మలను కోరుచున్నాము.

**– సంపాదకులు**

ఈ సంచికలో....

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


07-5-2000, నార్నిమెరక ........ 2
23-3-2000, కేశనకుర్రుపాలెం ........ 6
03-5-2000, గుమ్మంపాడు ........ 9
15-5-2000, మల్కిపురం ........ 14
10-5-2000, సిద్ధాంతం ........ 19

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, నార్నిమెరక, 7-5-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సృష్టి అంతా పరమేశ్వరుడిది. ఈ సృష్టి విషయం ఆయన చూసుకొంటాడు. ఇది అంతా ఆయన సొత్తు. మన సొత్తును మనం ఎలా జాగ్రత్తగా చూసుకొంటామో అలాగ ఆయనసొత్తును ఆయన జాగ్రత్తగా చూసుకొంటాడు. ఆయనలోపల ఉన్నాడు, బయట ఉన్నాడు, అంతటా ఉన్నాడు, మన హృదయంలో కూడా ఉన్నాడు. కాని మనకు అనుభవంలో లేడు. భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం మనకు ఉంది. శ్రవణం, మననం, ధ్యానం ఈ ప్రక్రియలు అన్నీ ఎందుకు అంటే మనకు ఉన్న విశ్వాసాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికే ఇవి అన్నీ. విశ్వాసాన్ని అనుభవంలోనికి తెచ్చుకొంటే దాని సుఖం శాంతి మనకు తెలుస్తుంది. మనందరము తేలిక మనుషులము. తేలిక మనుషులకు అనుభవం ఎలా వస్తుంది. మనకు ఎంతోకొంత చదువు ఉంది, డబ్బు ఉంది, సమాజంలో గౌరవం ఉంది కాని సహనం లేదు. సహనం లేని మనిషికి క్వాలిటీ పెరగదు. సహనం ఉంటేనే హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. ప్రతీమనిషి నేను బుద్ధిమంతుడిని అనుకొంటాడు, వాడు అనుకొంటే సరిపోదు, ఈశ్వరుడు అనుకోవాలి. ఈశ్వరుడు ఏ జీవుడికి తెలియబడాలి అనుకొంటాడో వాడికి మాత్రమే ఆయన తెలియబడతాడు. ఆ జీవుడికి ఎంతవరకు అర్హత ఉంది, యోగ్యత ఉంది అని చూసి ఆయన తెలియబడతాడు. భగవంతుడు మన హృదయంలో ఉన్నప్పటికి మనస్సులో ఉన్న దోషాలు ఆయన మనకు తెలియకుండా అడ్డువస్తున్నాయి. ఆ దోషాలు తొలగించుకోవటానికి ఉపాసన అవసరం.

మానవుడికి దుఃఖానికి కారణం కర్తృత్వం. కర్తృత్వం లేకపోతే దుఃఖం లేదు. సూర్యుడు చీకటిని ఏ విధంగా అయితే చూడలేడో అలాగే కర్తృత్వం లేనివాడికి దుఃఖం కనబడదు. మీ పుణ్యం నాకు అక్కరలేదు, మీ పాపం నాకు అక్కరలేదు. జీవకోటి అంతా నాకు సమానమే, నాకు పక్షపాతబుద్ధి లేదు అని భగవంతుడు చెపుతున్నాడు. ఆ పని చేయండి, ఈ పని చేయండి అని నేను మీకు చెప్పటం లేదు. ఎవడి అలవాట్లనుబట్టి, ఎవడి వాసనలను బట్టి వారు పని చేస్తున్నారు. వాటితో నాకు ఏమీ సంబంధం లేదు. నేను కేవలం సాక్షి మాత్రమే. దీపం ఉంది అది భగవద్గీత చదువుకొనేవారికి వెలుతురు ఇస్తుంది, పేకాట ఆడేవారికి వెలుతురు ఇస్తుంది. అందరికి వెలుతురు ఇస్తుంది. వారి అలవాట్లను బట్టి వారు ప్రవర్తిస్తున్నారు అంతే గాని పేకాట ఆడేవారికి వెలుతురు ఇవ్వను అని దీపం చెప్పదు. భగవంతుడు కూడా అట్టి వాడే. ఆయనకు అంతా సమానమే. మీ అలవాట్లను బట్టి మీరు తిరుగుతున్నారు వాటితో ఆయనకు సంబంధంలేదు. నిన్ను కర్తృత్వం

పెట్టుకోమని ఆయన చెప్పటంలేదు. నీకు దేహబుద్ధి ఉంది కాబట్టి కర్తృత్వం పెట్టుకొంటున్నావు. దేహం ఉన్నస్థితి నిజమైన స్థితికాదు. దేహంలేని స్థితి నిజమైన స్థితి అన్నారు భగవాన్. దేహం ఉన్నా దేహంలేని వాడిలాగ జీవిస్తే నిజస్థితి నీకు అందుతుంది. నీవు పని చేయవచ్చు కాని ఇది నావలననే అయ్యింది అనుకొంటే నీ మనస్సులో పునర్జన్మ హేతువులు పడతాయి. ఏదైనా మంచి చేసినా మర్చిపోవాలి, దానిని మోయకూడదు. దానిని మోస్తూ ఉంటే పునర్జన్మ హేతువులు ఏర్పడతాయి. పునర్జన్మ హేతువులు మనస్సులో పడకుండా చూసుకోవాలి. నీకు కర్తృత్వం నేను కల్పించటం లేదు. నీ అజ్ఞానం వలన, నీ బొగరుబోతుతనం వలన నీవే కల్పించుకొంటున్నావు. కర్తృత్వం నిజంకాదు. అది కల్పితమే. కల్పితంవలన దుఃఖం వస్తోంది. కర్తృత్వం లేనివాడు మూడులోకాలను దహనం చేసినా వాడికి దోషంలేదు అని కృష్ణుడు చెప్పాడు. కర్తృత్వంతో ఏ పనిచేసినా పుణ్యంచేస్తే దాని తాలూకు సుఖం, పాపం చేస్తే దాని తాలూకు దుఃఖం తప్పనిసరిగా వచ్చి తీరుతుంది, దానిని అనుభవించి తీరాలి.

దైవానుగ్రహం సంపాదించాలి అనుకొంటున్నాను, ఎలా ప్రయత్నం చేస్తే దైవానుగహం వస్తుంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. దొంగనేనును ఇచ్చేస్తే దైవానుగ్రహం వస్తుంది అంటున్నారు భగవాన్. నీవు దొంగనేను చుట్టూ తిరుగుచున్నావు. ఈ దొంగనేనును ఆయనకు ఇవ్వకుండా దైవానుగ్రహం రాదు. నీవు దొంగనేనును ఆయనకు ఇచ్చేస్తే నీకు దైవానుగ్రహం వస్తుంది. ఇప్పుడు మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో అదే దొంగనేను. అది దేహానికి పరిమితమైనది. దేహము, మనస్సు మనస్సులో ఉన్న అలవాట్లు ఇవి అన్నీ కలిపి దొంగనేను. వీరు బంధువులు, వీరు శత్రువులు అని ఇలా మనస్సులో గూడ్లు కట్టుకొంటాము. ఈ గూటిలో నుండి బయటకు రాకపోతే వాడు జ్ఞాని కాలేడు. మనం సత్వగుణం అలవర్చుకోవాలి. ఎవరికైతే సాత్వికబుద్ధి ఉందో వారు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. మనమనస్సులో మూడుగుణాలు తిరుగుతూ ఉంటాయి. సత్వగుణం ఎప్పుడో వస్తూ ఉంటుంది. సత్వగుణం వచ్చినప్పుడు దానిని పట్టుకొని అది మనలో ఎక్కువగా ఉండేలా ప్రయత్నం చేయాలి. బలవంతంగా రమ్మంటే అది రాదు. సత్వగుణం వచ్చినప్పుడు పట్టుకొని అది ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. మనమాట నిర్మలంగా ఉండాలి, సాత్వికంగా ఉండాలి, సత్యంగా ఉండాలి. మనకు ధర్మం యందుగౌరవం లేదు అనుకోండి, ధర్మం ఆచరించం అనుకోండి, మనం సత్యాన్వేషకులము కాదు అనుకోండి కేవలము శారీరక వ్యాయామాల వలన భగవంతుడుమోసపోడు, మనకు భగవదనుభవం కలుగదు. మీరు పూజ చేసిన, జపం

చేసినా, ధ్యానం చేసినా వాటి వలన ఎంతోకొంత పవిత్రులు అవ్వాలి లేకపోతే వాటివలన ప్రయోజనం లేదు. నేను ఒక వ్యక్తిని అనుకొన్నంతకాలం, నీవు దేహానికి పరిమితమై ఉన్నంతకాలం నీవు ఈశ్వరుని నమ్మవలె, నీకు ఉపాసన అవసరమే. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉన్నవాడు వాడు దురాచారుడు అయినప్పటికి వాడికి దురలవాట్లు ఉన్నప్పటికి వాడు తొందరగా బాగుపడతాడు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. వాడికి ఉన్న సజీవమైన విశ్వాసమే వస్తువును అనుభవంలోనికి తీసుకొని వస్తుంది.

ఈశ్వరుని ఆరాధించగా, ఆరాధించగా ఈశ్వరుడే గురురూపంలో వస్తాడు. మనం ఏ వస్తువును పొందుదామని అనుకొంటున్నామో ఆ వస్తువు గురించి గురువు బోధిస్తాడు. దానిని మనం శ్రద్ధగా శ్రవణం చేయాలి. శ్రవణం చేసిన దానిని మననం చేయాలి, ధ్యానం చేయాలి శ్రవణం చేసిన దానిని మనం అర్థం చేసుకోవాలి. అర్థమయితే ఆచరించాలనే బుద్ది కలుగుతుది. ఆచరిస్తే మనకు అనుభవంలోనికి వస్తుంది. కోరిక తెచ్చుకోకు, కోపం తెచ్చుకోకు, భయం తెచ్చుకోవద్దు. చావు ఏదో రోజు వస్తుంది. అది ఏ రోజు వస్తుందో ఆ రోజు చావుకు సంబంధించిన రుచి చూడవచ్చు కాని భయస్తుడు ఏ రోజుకారోజు చావును రుచిచూస్తూ ఉంటాడు. నీవు కర్తృత్వంను తీసి ఒక ప్రక్కన పెడితేనే గాని నీకు సత్యానుభవం కలుగదు. సత్యానుభవం కలిగితేనే గాని నీకు స్వేచ్ఛ లేదు, సుఖంలేదు, నీకు పూర్ణస్థితి రాదు. నీకు సత్యజ్ఞానం తెలిసేవరకూ మిధ్యాజ్ఞానం నిన్ను పీడిస్తూనే ఉంటుంది. నీకు నిజమేదో తెలిసేవరకూ నిజంకానిదానిని నిజం అనుకొంటావు. నీకు సత్యజ్ఞానం కలిగేవరకూ మిధ్యాజ్ఞానాన్ని సత్యజ్ఞానం అనుకొంటావు. మిధ్యాజ్ఞానాన్ని వదిలించుకోవాలి. నన్ను దర్శించి వెళ్ళినవాడికి పునర్జన్మలేదు అని ఒకసారి రామకృష్ణుడు చెపుతాడు. దర్శించి వెళ్ళిపోతేనే పునర్జన్మ లేని స్థితి వస్తుందా? మీ గురువు గారు ఇలా చెపుతున్నారు ఏమిటి అని వివేకానందను ఒక భక్తుడు అడిగాడు. అప్పుడు వివేకానంద ఏమి చెప్పాడు అంటే మా గురువుగారికి శరణాగతి పొందిన వారికి అని చెప్పాడు. మనం శరణాగతి ఎక్కడ చేస్తాము. ఈ మిధ్యానేను చేయనివ్వదు కదా. శరణాగతి అంత తేలికకాదు.

మేము కష్టాలుపడుతున్నాము అని చాలా మంది అంటున్నారు. మీ కష్టాలు నిజమైతే నిద్రావస్థలో ఆ కష్టాలు అన్నీ ఏమైనాయి. మీ మనస్సు ఎంత నిజమో ఆ కష్టాలు కూడా అంతే జనం. మనస్సు అణిగినప్పుడు ఆ కష్టాలు కూడాలేవు. నిద్రావస్తలో మనస్సు లేకుండా ఉన్నావు. ఆ స్థితిని జాగ్రదవస్థలో ప్రాక్టీసు చెయ్యి. జాగ్రదవస్థ దేవుడు ఎందుకు ఇచ్చాడు

అంటే ప్రాక్టీసు చేయటానికే ఇచ్చాడు. నిద్రావస్థలో సాధనలేదు, స్వప్నావస్థలో సాధన లేదు. జాగ్రదవస్థ ఎందుకు అంటే సాధన కోసమే. జాగ్రదవస్థలో నిద్రాస్థితిని ప్రాక్టీసు చెయ్యాలి. అప్పడు నీవు సిద్ధపురుషుడవు అవుతావు. మీకు సేవ చేస్తాము అని చాలా మంది అంటున్నారు. కాని వారు చేసే సేవ మాకు ఉపయోగపడటంలేదు, వారి వలన మా సమస్యలు పరిష్కారం అవ్వటంలేదు అని భగవాన్‌ను అడుగుతున్నారు. చేసేవాడు స్వార్థపరుడయితే, స్వార్థాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే ఆ పనివలన మీకు ఏమీ ప్రయోజనం ఉండదు అంటున్నారు భగవాన్. ద్వైత బుద్ధిని పెట్టుకొని సేవ చేయటం కాదు. నీకు ఆత్మజ్ఞానం కలిగితే, నీవు ఆనందస్థితిలో ఉంటే, జ్ఞానం యొక్క వైభవం నీకు అనుభవంలోనికి వస్తే నీ ఉపాధి ద్వారా అనేక మందికి సహాయ సహకారములు అందుతాయి. కొండమీద దీపం పెట్టి వెలుతురు కనబడకూడదు అంటే కుదరదు అది సహజంగా కనబడుతుంది. అలాగే నీకు బ్రహ్మానుభవం కలిగితే సహజంగానే నీ ద్వారామేలు జరుగుతుంది, అనేక మంది తరిస్తారు. సముద్రం పైన చూస్తే ఎలా ఉంటుంది కెరటాలు ఉంటాయి, నురుగు ఉంటుంది, బుడగలు ఉంటాయి. అంతా అల్లకల్లోలంగా ఉంటుంది. లోపలకు వెళ్ళి చూస్తే చాలా ప్రశాంతంగా ఉంటుంది. అలాగే నీకు కనిపించే గొడవలు అన్నీ పైపైనే గాని హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళి చూస్తే అక్కడ ఉన్నది శాంతే, ఆనందమే, అక్కడ ఉన్నది ఉండటమే. త్రాగటానికి మన చేతికి మంచినీరు దొరికినప్పడు ఎక్కడో నూతి దగ్గరకు, నది దగ్గరకు వెళ్ళవలసిన పని నీకు ఏముంది? అలాగే నీ హృదయంలో ఉన్న శాంతి, సుఖం నీకు అందినప్పడు ఎటు చూసినా శాంతే, ఎటు చూసినా ఆనందమే అప్పడు బాహ్యమైన సుఖాల కోసం తిరగవలసిన పని నీకు లేదు. ఒక మనిషికి లోపల సహజంగా భక్తి ఉందా లేక అది కల్పించుకొంటున్నాడా, అతని లోపలనేచర్ ఎటువంటిది అనేది ముఖ్యం. అతని లోపల నేచర్‌నుబట్టి మోక్షం కలుగుతుంది.

మన హృదయంలో నిజమైన నేను ఉంది అని మనకు తెలుసు. ఆ నేనుగురించి మనకు తెలియటంలేదు, ఆ నేను ఎవరో మనకు తెలియటంలేదు. అది తెలియటానికి సత్పురుషుల సహవాసం అవసరం. సత్పురుషుల మౌనం సరిపోతుంది, మాట అక్కరలేదు. వారి సన్నిధిలో మనస్సు అణిగిపోతుంది. మనస్సు అణిగినప్పడు మౌనం వస్తుంది. వారి సన్నిధిలో ఆ మౌనంలో ఆయనకు ఏ వస్తువు అయితే అనుభవంలో ఉందో అది మనకు కూడా స్ఫురిస్తుంది. మనకు స్ఫురించాలి అని ఆయన అనుకోడు. అనుకొనే వాడు ఎవడు అక్కడ ఉండడు. కాని సహజంగానే అది మనకు స్ఫురిస్తుంది. అది మహాత్ముల మౌనం వలన కలిగే సహకారం. మనం పని దొంగలము అవ్వకూడదు. మనం

చేస్తున్న పని ద్వారానే మనం తరించవచ్చు. మనం చేస్తున్నపని స్వార్థం లేకుండా చేస్తే మనం చేసే పనిద్వారానే మనం తరించవచ్చు. ఏరకంగా పని చేస్తే పని నిన్ను బంధించదో ఆ రకంగా పనిచెయ్యి. బుద్ధుడిని దేవుడు ఉన్నాడా లేడా అని అడిగితే మౌనం వహించేవాడు. ఆయన ఎక్కువగా మౌనంగా ఉండేవాడు. ఆ మౌనాన్ని మనం తప్పుగా అర్థం చేసుకోకూడదు. ఆ మౌనం ద్వారా శక్తిని ఇచ్చి మధ్యవర్తులతో సంబంధం లేకుండా ఎక్కడైతే ఆనందం ఉందో, ఎక్కడైతే నిర్వాణస్థితి ఉందో సూటిగా అక్కడకు అంటే హృదయగుహలోనికి పంపటమే ఆ మౌనం యొక్క లక్ష్యం. ఆ మౌనాన్ని మనం అపార్థం చేసుకోకూడదు.

మనం గృహస్థాశ్రమంలో ఉన్నా, సన్యాసాశ్రమంలో ఉన్నా, బ్రహ్మచర్యంలో ఉన్నా మనస్సులో అల్పత్వం ఉంటే వాడికి జ్ఞానం రాదు. మా అత్తగారు నన్ను ఎక్కువగా తిడుతున్నారు అని ఒక కోడలు భగవాన్‌తో చెపుతున్నారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నువ్వు నా దగ్గరకు ఎందుకు వస్తున్నావు అని అడిగారు. మిథ్యా నేనును పోగొట్టుకోవటానికి వస్తున్నాను అని చెప్పింది. మీ అత్తగారు ఎవరిని తిడుతున్నారు ఆ మిథ్యానేనునే తిడుతున్నారు. నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలి అని ప్రయత్నంచేస్తున్నావో ఆ దొంగనేనునే, మిథ్యానేనునే మీ అత్తగారు తిడుతున్నారు అంటే మీ అత్తగారునీకు అపకారం చేయటంలేదు, ఉపకారమే చేస్తున్నారు అని భగవాన్ చెప్పారు. నువ్వు దేనిని పోగొట్టు కోవటానికి ప్రయత్నంచేస్తున్నావో అదిపోవటానికి పరోక్షంగా మీ అత్తగారు సహాయం చేస్తున్నారు అని చెప్పారు. వర్షం రూపంలో వచ్చేవాడు ఈశ్వరుడు, వర్షాన్ని ఆపేవాడు ఈశ్వరుడు. అందుచేత ఈశ్వర సంకల్పాన్ని వ్యతిరేఖించకూడదు. ఈశ్వర సంకల్పానికి అనుకూలంగా మన మనస్సు స్పందించదు అనుకోండి మనకు దుఃఖం వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, కేశనకుర్రుపాలెం, 23-3-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు తన హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొనేవరకు సంతృప్తి అవ్వడు. మనకు లేనిది ఏదోవచ్చాక మనం సుఖపడవచ్చు అనిపిస్తుంది. కాని అదివచ్చాక అందులో ఏమీ లేదని తెలుస్తుంది. మన హృదయంలో ఉన్న నిజం మనకుఅనుభవం అయ్యేవరకూ జనన మరణ ప్రవాహములో కొట్టుకొని పోవలసిందే. ఎవరు ఏ మార్గములో ప్రయాణం చేసిన ప్రకృతి లక్షణాలను దాటి వెళ్ళాలి. మరణించే

ఈ శరీరముతో నీకు ఎంతబలంగా, ఎంత గాఢంగా తాదాప్యం ఉందో అంత బలంగా నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో సంపూర్ణంగా తాదాప్యం రావాలి అప్పడు అజ్ఞానం నశిస్తుంది. దేహం కూడా నీడ ఎలా వస్తుందో అలాగ మన వెనకాలు ఇష్టాలు అయిష్టాలు వస్తాయి. వాటి వలన హృదయంలో ఉన్న మనస్సు బాహ్యాముఖానికి వస్తుంది. అందువలన మన ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోవాలి, మన ధర్మం ఏదో మనం ఆచరించాలి. ఈ శారీరమే నేను అనుకొనే మనస్సుకు ఇది నీవు కాదు, లోపల ఉన్న సద్వస్తువే నీవు అని చెప్పిదానిని లోపలకు తీసుకొని వెళ్ళాలి, దానికి అంతర్దృష్టి కలుగజేయాలి. పరిణామంలో మనం ఆజన్మకు ఆ జన్మ వివేకవంతంగా, మెలుకువగా జీవించాలి. అజాగ్రత్త పనికి రాదు, అశ్రద్ధ పనికి రాదు. అశ్రద్ధ ఉన్నవాడికి జ్ఞానం రాదు.

పూజ చేయాలన్నా, యజ్ఞం చేయాలన్నా మనం ఎంతో కొంతపని చేయాలి. అలాగే మన హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభంలోనికి తెచ్చుకోవాలంటే మనం ఏరకంగా పనిచేస్తే అది అనుభవంలోనికి వస్తుందో తెలుసుకొని ఆ రకంగా పనిచేయటం నేర్చుకోవాలి. మనం చేస్తున్న పని మనలను బంధించకూడదు. ఇతరులలో ఉన్న దోషాలు చూస్తూ ఉంటే ఈ లోపల మీ రోజులు వెళ్ళిపోతాయి. మీ దోషాలు మీకు తెలియవు. ఎవరి మీద మోహం పెట్టుకోకూడదు, ద్వేషం పెట్టుకోకూడదు. అంతర్యామిగా ఉన్న పరమేశ్వరుని చూడటం అలవాటు చేసుకోవాలిగాని కొంతమందిని ద్వేషించటం కొంతమందిని అతిగా ప్రేమించటం అలాగైనా ఇలాగైనా నీ మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది. రెండూ చెడ్డవే. భగవంతుని రూపాన్ని నామాన్ని ధ్యానించగా ధ్యానించగా మనకు బోధించటానికి భగవంతుడే గురురూపంలో వస్తాడు. భగవంతుడు గురురూపం ధరించాలి అంటే మనం చేసే పని ద్వారా భగవంతుని దయను సంపాదించాలి. బేధం భగవంతుడికి లేదు, జీవుడికి బేధం ఉంది, బేధబుద్ధి తగ్గించుకోవాలంటే ఇష్టాయిష్టాలు తగ్గించుకోవాలి. ఈశ్వరుడి మీద సజీవమైన విశ్వాసం కలుగకపోతే ప్రతీ చిన్న విషయానికి భయం వచ్చేస్తుంది. మనోధైర్యం అలవాటు చేసుకోవాలి. అన్ని మానసిక రుగ్మతలకు భయమే కారణం. భయం తగ్గించుకొంటే పరిణామంలో మంచి భవిష్యత్ ఉంటుంది. చాలా మందికి మంచిపనులు చేయాలని ఉంటుంది గాని భయం వలన చేయలేరు. భయం తగ్గించుకొంటే మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. ఉన్నది ఒక్కటే వస్తువు. రెండు ఉన్నప్పడు భయం వస్తుంది. ఉన్నది ఒక్కటే అయినప్పడు భయపడేది ఏముంది, భయపడవద్దు. అందరిచేత మంచి అనిపించుకోవాలంటే అది కూడా పిచ్చితనంలో ఒకటి అంటే వాడికి లోకవాసన ఎక్కువగా ఉంది అని అర్ధం. అలా అనుకొనే మనిషి మాయ యొక్క వలలో ఉంటాడు.

శీతాకాలంలో మనం చలి ఫీల్ అవుతాము. ఎండాకాలంలో వేడి ఫీలవుతాము. అలాగే నీ హృదయంలో ఉన్న ఆనందాన్ని, సత్యాన్ని ఫీలవ్వటం ప్రారంభిస్తే దాని వైభవం నీకు తెలుస్తుంది. ఇతరుల మాటలు మీరు నమ్మనక్కరలేదు. భగవంతుడు గురురూపం ధరించి వచ్చి చూపుద్వారా మాట ద్వారా మీ మనస్సును నిర్మలం చేస్తాడు, నిశ్చలం చేస్తాడు. మీ తల్లిదండ్రులు మీకు తిండి సంపద ఇవ్వగలరు గాని మీ మనస్సును నిర్మలం చేయలేరు. గురువు నీ మనస్సును నిర్మలం చేసి నిశ్చలం చేసి నిన్ను గమ్యం దగ్గరకు తీసుకొని వెళతాడు. అవమానాలు భరించాలి. అవమానాలు భరించలేకపోతే దేహాభిమానం పెరిగిపోతుంది. పూర్వం నేను వండిన కూర బాగాలేదు అని మా ఆయన అన్నారు అప్పటినుండి ఆయనను చూస్తూ ఉంటే ఎక్కువ కోపం వచ్చేస్తోంది అని ఒక అమ్మగారు చెపుతున్నారు. ఆయన అన్నది చిన్నమాట, కాని దేహాభిమానం వలన అలా అనిపిస్తోంది. ఇటువంటి మాటలు పట్టించుకొంటే మనకు జ్ఞానం కలుగదు. ఇటువంటి మాటలు ఎలా తీసుకోవాలి అంటే మనం కూర బాగా వండలేకపోతున్నాము. ఇంకా బాగా వండాలి అని లోపాలు గ్రహించి మనం సరిచేసుకోవాలి గాని ఇలా కోపాలు తెచ్చుకోవటం వలన ఈశ్వరానుగ్రహానికి దూరమవుతాము. మనకు ఎంతసేపు బహుమానాలు పుచ్చుకోవటం చేతనవును గాని అవమానాలు భరించలేము. ఎవరైనా బంధువులు ఇంటికి వెళితే వారు మాట్లాడలేదు అనుకోండి అది కూడా భరించాలి. అవమానాలు భరించలేకపోతే దేహాభిమానం పెరిగిపోతుంది. అజ్ఞానం పెరిగిపోతుంది.

నా గురువును ఎలా కనుక్కోవాలి అని ప్రశ్న. నిరంతరం ధ్యానం చేయటం వలన నీ గురువు ఎవరో నీకు తెలుస్తుంది. ఎవరు జ్ఞాపకం రావటం వలన నీ హృదయంలో ఉన్న సౌందర్యం నీకు తెలుస్తోందో, ఎవరిని తలచుకోవటం వలన నీ మనస్సు నిర్మలం అవుతోందో వాడే నీ గురువు. మనం దేహం అనే అడవిలో ఉన్నాము. ఈ అడవిలో నుండి బయటకు రావటానికి నీకు మార్గం చూపేవాడే గురువు. గురువే ఉపాయం, గురువే గమ్యం. మా హృదయంలో సత్యవస్తువు ఉంది అని మీరు చెపుతున్నారు. దానిని తెలుసుకోవటానికి మీరు సహాయం చేయరా అని అడుగుతున్నారు. గురువు సహాయం ఎప్పుడూ ఉండనే ఉంటుంది. అది నీ కళ్ళకు కనబడదు. మీ మనస్సుకు అంతర్‌దృష్టి కలిగితే హృదయంలో ఉన్న ఈశ్వరుడి టచ్ నీకు తెలుస్తుంది. గురువు లోపల ఉన్నాడు అంటున్నారు. లోపల గురువు కాదు, నాకు కళ్ళకు కనబడే గురువు కావాలి అని అడుగుతున్నారు. నీ కళ్ళతో చూసే గురువే చెపుతున్నాడు గురువు లోపల ఉన్నాడని అంటున్నారు భగవాన్. ప్రతీ జన్మలో గురువునీకూడా వస్తాడు. నిజమైన గురువు నీ లోపలే ఉన్నాడు కదా ఆయన నీకు

అనుభవంలోనికి వచ్చేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. రేపు ఏమిజరుగుతుందో చెపుతారు అనుకోండి, రాబోయే జన్మలో ఎక్కడ ఉంటారో చెప్పగలిగే శక్తి మీకు ఉంది అనుకోండి కాని మీకు శాంతి లేకపోతే వాటివలన ఏమీ ప్రయోజనం లేదు. శాంతి లేనివాడికి సుఖం లేదు. దేవుడు ఉన్నాడో, లేడో మనకు తెలియదు, దేహం, మనస్సు మనకు తెలుస్తోంది. ఈ దేహాన్ని, మనస్సును దేవుడు చెప్పినట్లు మలచుకో. అప్పుడు దేవుడు తెలియబడతాడు. వివేకవంతుడిగా జీవించే వాడికి ఎప్పటికప్పుడు మనస్సు బేలెన్స్ చేసుకొంటూ జీవించే వాడికి హృదయంలోఉన్న జ్ఞానగంగ అందుతుంది. గురువు అనుగ్రహం లేదు అని అనుకోవద్దు. అది ఎప్పుడూ ఉంది కాని అది మీకు తెలియటం లేదు. ఆ తెలిసే రోజు వస్తుంది. గురువు యందు భక్తి కలిగినప్పుడు శరణాగతి భావన కలిగినప్పుడు, ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అనే స్థిరమైన భావన మీకు కలిగినప్పుడుగురువు అనుగ్రహం మీకు తెలుస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, గుమ్మంపాడు, 3-5-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏపని ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతూ ఉంటుంది. మనం కంగారుపడినంత మాత్రం చేత తొందరగా జరుగదు. మనం భౌతికంగా అయినా, అధ్యాత్మికంగా అయినా అభివృద్ధి పొందటానికి కొంతటైము పడుతుంది. మన చేతిలో ఉన్నది కృషి. ఆ కృషి తాలుక ఫలం ఎప్పుడు రావాలన్నది ఈశ్వరుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. అందువలన మన చేతిలోఉన్న పనిని శ్రద్ధగా చేయాలి. ఫలితం కోసం ఎదురు చూడకూడదు. ఒక సంపన్నురాలు భగవాన్ దగ్గరకు వచ్చారు. మీ సన్నిధి వలననే శాంతి కలుగజేస్తారని విన్నాను. ఇది వరకు ఒకసారి మీ దగ్గరకు వచ్చాను కాని మీ దగ్గర ఎక్కువ కాలం ఉండలేకపోయాను, దర్శనం చేసుకొని వెళ్ళిపోయాను. మా ఇరుగుపొరుగు వారు సత్యాన్వేషకులు కాదు, సత్యాన్ని తెలుసుకొందామని ధ్యాస వారికి లేదు, సాధనలో సహకరించే మనుషులు కాదు. అందరూ నేను, నేను అంటున్నారు ఈ నేనులు అన్నీ దొంగనేనులు అని మీరు చెపుతున్నారు. నిజమైననేను హృదయంలో ఉంది అని చెపుతున్నారు. అంతలోతులలోనికి వెళ్ళే వైరాగ్యం నాకు లేదు. వైరాగ్యం లేకపోతే అంతలోతులలోనికి వెళ్ళలేము కదా. ఏదో కొద్ది రోజులు ఇక్కడ ఉండాలి అని వచ్చాను. ఈ కొద్ది రోజులలో మీరు మమ్మల్ని అనుగ్రహించండి అని అడగటం న్యాయంకాదు, కాని

అడగకుండా ఉండలేకపోతున్నాను. బాహ్యంగా నాకు ఏమీ లోటులేదు. డబ్బు ఉంది, తెలివి ఉంది. ఇవి అన్నీ ఉన్నా నేను శాంతిగా ఉన్నాను, నాలో వెలితి లేదు అని చెప్పటానికి మీ దగ్గర నాకు నోరు రావటంలేదు. నేను శాంతిగా లేకుండా శాంతిగా ఉన్నాను అని చెపుతాను అనుకోండి నన్ను నేను మోసం చేసుకొన్నట్లు అవుతుంది. హృదయంలో శాంతి ఉంది. అక్కడకు వెళితేనే గాని శాంతి దొరకదు అని మీరుచెపుతున్నారు. బహుశా నేను ఇంకా హృదయంలోనికి వెళ్ళలేదేమో? అందువలన శాంతి నాకు దొరకటంలేదు. హృదయంలో శాంతి ఉంది, మనస్సును తీసుకొని వెళ్ళి హృదయానికి స్వాధీనం చేయమని మీరు చెపుతున్నారు. మనస్సులో స్వార్థం ఉంటే హృదయానికి స్వాధీనం అవ్వదు అని చెపుతున్నారు. మేము పూర్తిగా స్వార్థం విడిచిపెట్టాము అని చెప్పలేను అలాగని స్వార్థపరులము అని చెప్పలేము. అటు ఇటు కాకుండా ఉన్నాము. మేము ఆడవాళ్ళము పెద్ద పెద్ద సాధనలు చేయలేము, ఏదోసామాన్యంగా చేయగలము. నాలో అశాంతి పోవాలంటే ఈ దొంగనేను పోతేగాని అశాంతి పోదు అని మీరు చెపుతున్నారు. ఈ దొంగనేను మీ అనుగ్రహం వలన పోతుందిగాని నా తెలివితేటల వలన పోదు. అందువలన మీరు నా పట్ల దయచూపించి ఈ అశాంతిని పోగొట్టాలి. మా మిధ్యానేను మీరు కాదు. మాలో ఉన్న నిజమైన నేనే మీరు మాలోపల మీరు ఉన్నారు కాబట్టి మా అశాంతిని పోగొట్టగల సమర్థులు మీరు. అందువలన మా అశాంతిని పోగొడతారని ఆశించి ఇక్కడకు వచ్చాను. అందువలన మీరు నన్ను ఆశీర్వదించండి అని సంపన్నురాలు భగవాన్‌ను అడుగుతున్నారు. మీ ఆశీస్సులు అందిస్తే గాని నాలోని అశాంతి పోదు. అయితే మీ ఆశీస్సులు అందుకోవడానికి తగిన అర్హత ఉంది అని నేనుచెప్పలేను. నీకు అర్హతలేదు యోగ్యతలేదు అని మీరు అనవద్దు. అర్హత, యోగ్యత కలుగజేసి నాలోని అశాంతిని తొలగించండి అని అడుగుతున్నారు. మిధ్యానేను పోతేగాని అశాంతి పోదు అంటున్నారు అందుచేత మిధ్యానేనును తొలగించుకొనే శక్తిని మీరే ఇవ్వాలి గాని కేవలము నేను సాధన చేసి పోగొట్టుకొనే శక్తి నాకు లేదు అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే నీకు భక్తి ఉంది, వివేకం ఉంది. నీ భక్తే నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చింది. నేను నిన్ను ఉద్ధరిస్తాను అని భగవాన్ చెప్పటంలేదు. ఏ భక్తి అయితే నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చిందో, ఏ వివేకం అయితేనిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చిందో ఆ భక్తే, ఆ వివేకమే నిన్ను బాగుచేస్తుంది, నీ అశాంతిని పోగొడుతుంది. ప్రత్యేకంగా నేనుచేసేది ఏమీ లేదు. నీ వివేకమే, నీ శ్రద్ధే, నీ తపనే నీ అశాంతిని పోగొడుతుంది అంటున్నారు భగవాన్. భక్తి అంటే భగవంతునితో మానసిక అనుబంధం కలిగి ఉండటం ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. మీరు నిరంతరము భగవంతునితో అనుబంధం పెట్టుకొంటే

మీలో కోటిజన్మలకు సరిపడదోషములు ఉన్నా అవి అన్నీ కాలి బూడిద అయిపోతాయి. దొంగనేనును తీసి ఒక ప్రక్కన పెట్టి ఈశ్వరుని పట్ల భక్తి కలిగి ఉన్నాము అనుకోండి పొందవలసిన వస్తువును పొందుతాము.

పూర్వజన్మలు మనకు జ్ఞాపకం లేవు. కాని పూర్వజన్మలలో మనం చేసిన పనులు మనలో వాసనలుగా ఉన్నాయి. అవి పోవటానికి మనం సాధనలుచేస్తాము. నీవు పెద్దపెద్ద సాధనలు చేయనక్కరలేదు నిరంతరము ఈశ్వరునిపట్ల భక్తి కలిగి ఉండు. అప్పడు నీ మనస్సు బాగుపడుతుంది. బాగుపడిన మనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది. ఎప్పడైతే మనస్సుకు అంతర్‌దృష్టి కలిగిందో అప్పడు మనస్సు వెళ్ళి హృదయంలో లయమవుతుంది. అప్పడు అక్కడ ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందము దాని స్వరూపమే ఉండటం. అది తెలుసుకొన్నాక మనిషికి స్వేచ్ఛ కలుగుతుంది. మనం మనోపరిధిని దాటి వెళ్ళాలి. మనిషిని పీడించేది మనస్సు. ఆ మనస్సును బాగుచేసుకోవాలి. మనస్సు బాగుపడాలంటే నిరంతరము ఈశ్వరుని చింతించటం వలన మనస్సు పరిశుద్ధమవుతుంది. నాకు శాంతి కావాలి, శాంతి ఎలా లభ్యమవుతుందో నాకు తెలియటంలేదు. నాపట్ల దయచూపించి శాంతిని పొందే మార్గం చూపించండి అని అమ్మగారు భగవాన్‌ను అడుగుతున్నారు. శరణాగతి వలన లోపల శాంతి నీకు దొరుకుతుంది. భగవంతుని ఆజ్ఞలేకుండా ఏమీ జరుగదు. భగవంతుని సంకల్పాన్ని నీ సంకల్పంచేసుకొంటే, భగవంతుని ఇష్టాన్ని నీ ఇష్టం చేసుకొంటే నీకు శాంతి దొరుకుతుంది. నీవు భగవంతునికి వేరుగా లేవు. కాని ఈ దొంగనేను భగవంతుని కంటే నీవువేరుగా ఉన్నావనే భావనను కలుగజేస్తోంది. నీవు భగవంతుడి కంటేవేరుగా ఉన్నావని ఏదైతే చెపుతోందో దానిని నీ వివేకంతో తొలగించుకొంటే ఎక్కడో రాళ్ళలో, రప్పలలో, గుడులలోవెతుకుచున్నదేవుడు నీ హృదయంలోనే దర్శనం ఇస్తాడు. అప్పడు అమ్మా నీకు శాంతి దొరుకుతుంది అని భగవాన్ చెపుతున్నారు. మిధ్యానేను యొక్క మూలం నీ హృదయంలో ఉంది. దానిని అక్కడకు తీసుకొని వెళ్ళగలిగితే నీకు మోక్షస్థితి కలుగుతుంది. పరమశాంతి దొరకటం కోసం నీవు శరీరం చనిపోయే వరకు ఆగనక్కరలేదు, శరీరం ఉండగానే నీకు శాంతి దొరుకుతుంది. నీకు సహజంగానే భక్తి, వినయం, తెలుసుకోవాలనే కాంక్ష ఉంది. ఆకాంక్షే తెలుసుకొనేటట్లు చేస్తుంది.

భక్తులకు ఉండవలసిన లక్షణాలు అన్నీ నాకు ఉన్నాయా అని అమ్మగారు భగవాన్‌ను అడుగుతున్నారు. దానికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఎవరైనా ప్రయత్నం చేస్తే భక్తులు అవ్వవచ్చు, టైముపడుతుంది. సహనంతో ప్రయత్నం చేస్తే భక్తి కలుగుతుంది.

మోక్ష స్థితిని నీ భక్తే నీకు సంపాదించి పెడుతుంది. ఒకేసారి పూర్ణస్థితి రాదు. కొంచం కొంచం ప్రయత్నం చేయగా పూర్ణస్థితి కలుగుతుంది. ప్రయత్నం మానకూడదు. మనం బాగుపడాలంటే ఇతరులనుతిట్టటం మానివేసి మన మనస్సును మనం తిట్టుకోవాలి. మన మనస్సును మనం నిందించుకొంటే మనం బాగుపడతాము.

నీలో బలహీనతలు తెలుసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నిన్ను నీవు విమర్శించుకో. ఏ క్షణంలో ఏది వస్తే అది ఈశ్వరసంకల్పంగా దానిని అంగీకరించు. అప్పుడు నీకు భక్తి కలుగుతుంది. భగవంతుడు ఇలా చేసాడు ఏమిటి అని అనుకోవద్దు. నీ జీవితాన్ని ఎలా మలుపు తిప్పాలో భగవంతుడికి తెలుసు. అందువలన భగవంతుడి సంకల్పాన్ని అంగీకరించు, గౌరవించు. నీదగ్గర డబ్బు ఉంది అనుకో బజారుకు వెళ్ళి వస్తువులు ఎంతసేపు కొనుక్కొంటావు అలాగే భక్తికి సంబంధించిన సామాగ్రి అంతా సంపాదించుకొంటే భక్తి కొన్నిక్షణాలలో వచ్చేస్తుంది. నేను గృహస్థాశ్రమంలో ఉన్నాను. గృహస్థాశ్రమంలో నా పని నేను చేసుకొంటూ భక్తిని పెంచుకొనే మార్గం చెప్పండి అని అడుగుతున్నారు. గృహస్థాశ్రమం భక్తికి, జ్ఞానానికి అడ్డుకాదు. నీవు ఏ ఆశ్రమంలో ఉన్నా ఈ దేహం నీవు కాదు, ఈ దొంగనేను నీవు కాదు. వీటిని తీసి ఒక ప్రక్కన పెట్టు. నీలోపల చైతన్యం ఉంది. అది శుద్ధంగా ఉంది. అంత శుద్ధంగా ఉండటానికి ప్రయత్నించు. నీవు గృహస్థాశ్రమంలో ఉన్నా ఇబ్బంది లేదు. నీ మనస్సు నిర్మలంగా ఉండాలి, శుద్ధంగా ఉండాలి. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా శాంతిని పోగొట్టుకోవద్దు. భక్తులు కానివారు పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఒకలాగ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే మరొకరకంగా ఉంటారు. భక్తులు కాని వారు ఎలా ఉన్నారో నీవు కూడా అలాగ ఉంటే నీకు భక్తి ఎలా కలుగుతుంది.

తినటానికి తిండిలేనప్పుడు మాకు ఇతరుల గొడవ ఎందుకు పొట్ట వెళ్ళిపోతే చాలు అనుకొంటాడు. పొట్టకు సరిపడ అందింది అనుకోండి అప్పుడు పదిమంది మీద పెత్తనం చేయాలనిపిస్తుంది. మాయ అంతా మనస్సులో ఉంది. అజ్ఞానం అంతా మనస్సులో ఉంది, చీకటి అంతా మనస్సులో ఉంది. ఆ మనస్సు పోతే గాని ఎవడూ జ్ఞాని కాలేడు. ఈ శరీరమే నేను అని అనుకొంటున్నాను. కాని మీరు ఏమి చెపుతున్నారు అంటే నీవు శరీరము కాదు, నీవు చైతన్యమే అని చెపుతున్నారు. నేను చైతన్యమునుఅనుకొంటూ గృహస్థాశ్రమంలో ఉండటం సాధ్యమవుతుందా అని అడుగుతున్నారు. నీవు అనుకొన్నా, అనుకోకపోయినా నీవు చైతన్యమే. ఉన్నది ఒక్కటే వస్తువు అది తప్ప ఏమీలేదు. మిగతావి అన్నీ బొమ్మలు, నీడలు. నీ దేహాభిమానం మిగతావి ఉన్నట్లు అనిపింపజేస్తోంది. ఉన్నది ఒక్కటే వస్తువు.

ఆ వస్తువే నీవు అని నీకు తెలియకపోయినా అదే నువ్వు. అందులో సందేహం లేదు. దేహాభిమానం వలన అన్నీ ఉన్నట్లు నీకు అనిపిస్తోంది. దేహాభిమానంపోతే ఏమీలేదు. దేహబుద్ధి నశించిన వెంటనే నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. అప్పుడు పొందేది ఏదో నీవు పొందుతావు. నీవు నిర్మలంగా ఉండు, నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి ఫలితం కోసం ఎదురు చూడకు, వచ్చేది ఏదో వస్తుంది రానిది ఏదో రాదు. మనలో అహంభావన పెరగటానికి మిధ్యానేను చుట్టూ తిరిగే తలంపులు, మనం స్వార్ధంతో చేసే పనులు ఇవి రెండూ కారణం. బాగా ధనవంతులు అయి ఉండి ఆ ధనం ఎంతోకొంత సమాజమునకు ఉపయోగపడకపోతే వారు జీవించి ఉన్నా చనిపోయిన వారితో సమానము అని వివేకానంద చెప్పాడు. ఇంట్లో చేసుకొనే పనికి, జ్ఞానానికి విరోధం లేదు. ఇంట్లో పనిచేసుకోవటం వలన జ్ఞానం రావటం ఆగిపోదు. అయితే భగవాన్ ఒక మాట చెప్పారు గృహస్థాశ్రమాన్ని మనస్సులో విడిచి పెట్టండి, బయట విడిచిపెట్టినట్లు కనపడకండి అని చెప్పారు. మీరు మనస్సులో అన్నీ విడిచిపెట్టండి కాని అన్నీ విడిచి పెట్టినట్లు ఇతరులకు కనబడవద్దు.

నాకు దేహంతోతాదాప్యం ఉంది, అశాంతిలో ఉన్నాను. ఏదో ఒంటరిగా ఉండి సాధన చేసుకొందాము అంటే ఇంటి దగ్గర చుట్టాలగొడవ ఎక్కువగా ఉంది. నా పరిస్థితి వివరంగా చెపుతున్నాను. ఏకాంతవాసం కావాలనుకొంటున్నాను అని చెపుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఏకాంతవాసం అంటే ఆత్మలో ఉండటమే. నీవు మనస్సులో ఉంటున్నావు. నీవు కాని దానిని నీవు అనుకొంటున్నావు. అందువలన ఈ సమస్యలు అన్నీ వస్తున్నాయి. నీవు ఎవరో నీకు తెలిస్తే ఈ సమస్యలు ఉండవు. చుట్టాలు వస్తే గౌరవించు వారితో మమకారం పెట్టుకోకు. వారితో మమకారం పెట్టుకోకపోతే నీకు ఏ కాంతవాసం వచ్చేస్తుంది. చుట్టాలకు అన్నం పెట్టటం వలన నీ ఏకాంతవాసం పోవటంలేదు. వారి మీద మమకారం పెట్టుకోవటం వలన ఏకాంతవాసం పోతుంది. వారిపట్ల నీ డ్యూటీ ఏదో అది చేయాలి అంతే గాని వారిపట్ల మమకారం పెట్టుకోకూడదు. మనం ట్రైనింగ్పొందటానికి ఈ భూమి మీదకు వచ్చాము. మనం బాగుపడే విధానం చూసుకొని బాగుపడి బయటకు పోవాలి. నువ్వు బాగుపడితే నిన్ను చూసి కొంతమంది బాగుపడతారు. నీవు శాంతిగా ఉండు. నిన్ను చూడటం వలన కొంతమందికి శాంతి దొరుకుతుంది. అంతేగాని నటన వద్దు.

మా అబ్బాయి చనిపోయాడు. జ్ఞాపకం వచ్చినప్పుడు దుఃఖం వస్తోంది అని భగవాన్తో చెపుతున్నారు. నీవు నిద్రావస్థను జ్ఞాపకం పెట్టుకో అంటున్నారు భగవాన్.

నిద్రలో మీ అబ్బాయి గొడవ ఉందా? చావు గొడవ, పుట్టుక గొడవ ఉందా? నీ శరీరం గొడవ ఉందా? ఏదీ లేదు. శరీర ధ్యాస వచ్చినప్పుడు మీ అబ్బాయి గొడవ గాని ఈ శరీరం నీవు కాదు అని నీకు తెలిసినప్పుడు అబ్బాయి గొడవలేదు. శరీరాన్ని బట్టి ఇవి అన్నీ వస్తున్నాయి. నిద్రావస్థలో ఎలా ఉన్నావో జాగ్రదవస్థలో కూడా అలా ఉండటం నేర్చుకొంటే ఏ గొడవలు ఉండవు. మనకు తెలిసిన ఈ మూడు అవస్థలు జాగ్రదవస్థ, స్వప్నావస్థ, గాఢనిద్ర ఇవి మూడూ నిజం కాదు. ఈ మూడు అవస్థలకు అతీతంగా ఒక వస్తువు ఉంది. దానిని తెలుసుకొంటే నిజం ఏమిటో నీకు తెలుస్తుంది. ఈ సంసారం, నేను, నాది, ఈ లోకం అన్నీ కూడా అహంభావన నుండి వచ్చినవే. అహంభావన అణిగిపోతే ఏదీ లేదు. నిద్రావస్థలో అహంభావన అణిగిపోతుంది. అందుచేత అక్కడ ఏ గొడవ లేదు. ప్రతీ మానవుడికి దుఃఖాన్ని తీసుకొని వచ్చేది అహంభావనే కదా అది ఏ జన్మలో వచ్చింది అని ఆచార్యుల వారిని అడిగారు. అది నీకు ఏ జన్మలో వచ్చిందో చెప్పలేను. దానికి ఆది లేదు కాని అంతం ఉంది. విచారణ చేస్తే అది పోతుంది కాబట్టి దానికి అంతం ఉంది. అంతం చూసుకో ఆది గొడవ ఎందుకు అని చెప్పారు. నీ స్వరూపమే ఈశ్వరుడు. దానినుండి నిన్ను వేరు చేసేది అహంభావన. అహంభావన తొలగించుకొంటే అహంభావన లేనప్పుడు ఏదిగా ఉన్నావో అదిగా ఉంటావు. అహంభావన పోగొట్టుకోవటం నీకు ఇష్టంలేదు ఎందుచేతనంటే అదే నీవు అనుకొంటున్నావు. అది పోతే నీవు పోవు, నీవు ఎవరో నీకు తెలుస్తుంది. అది పోతే చైతన్యం మిగులుతుంది. అదే శాంతి, అదే ఆనందం అదే చావులేని స్థితి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-5-2000, మల్కిపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతునికి అసలు రూపంలేదు. రూపంలేకపోవటమే ఆయన రూపం. మనం రూపంతో తాదాత్మ్యం పొందుతున్నాము కాబట్టి రూపంలేని సత్యవస్తువును మనం పట్టుకోలేము. అందువలన ఉపాసనకోసం రాముడిని నేను, కృష్ణుడిని నేను, కుమారస్వామిని నేను అని భగవంతుడు చెప్పాడు. ఉపాసన లేకపోతే ఏకాగ్రతరాదు, పవిత్రతరాదు, మోక్షంరాదు. మనపూర్వజన్మ సంస్కారాన్నిబట్టి ఒకోరూపం మనలను ఆకర్షిస్తుంది. మనం రూపంతో తాదాత్మ్యం పొందుతున్నంతకాలం రూపంలేని వస్తువును మనం పొందలేము. మనకుసపోర్టుకావాలి. ఆసపోర్టు కోసమే గురువునుగాని, అవతార

పురుషుడినిగాని మనం ధ్యానంచేయాలి. సత్యవస్తువు, మరణంలేనివస్తువు మన హృదయంలో ఎక్కడో లోతులలో ఉంది. అంతలోతులలోనికి వెళ్ళటానికి ఇప్పడు మనకు ఉన్న అభ్యాసం, వైరాగ్యం చాలదు. అభ్యాసం, వైరాగ్యం పెంచుకోవాలి. మనకు వచ్చే తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనంతినే తిండివిషయంలో, చేసే స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం మాట్లాడేమాటలకు మనం బాధ్యత వహించాలి లేకపోతే నోరుమూసుకొని కూర్చోవాలి. మనం భక్తిలో అభివృద్ధిలోనికి రావాలంటే మనం మాట్లాడే మాటల విషయంలో, చేసే పనుల విషయంలో బాధ్యతగా ఉండాలి. కొంతమంది గాలిమాటలు మాట్లాడతారు వారికి ఏమీ బాధ్యత ఉండదు. అలా ప్రవర్తించకూడదు. భగవంతుడు మన ఉపాధి ద్వారా ఏపని అయితే మనకు అర్పించాడో అది బాధ్యతగా చేస్తే మనకు ప్రారబ్ధం నశిస్తుంది, వస్తువు ఎరుకలోనికి వస్తుంది. ఇప్పడు మన శరీరం మనకు ఎలా ఎరుకలో ఉందో అలా లోపల ఉన్న సద్వస్తువు అంత డైరెక్టుగా మనకు ఎరుకలోనికి వస్తుంది.

మనం పనిదొంగలుగా ఉండకూడదు. ఈ శరీరం చనిపోయేవరకు అనేక అనుభవాలు వస్తాయి. పొందవలసిన అనుభవాలు పొందేవరకు, తినవలసిన మొట్టికాయలు తినేవరకు మనకు చావురాదు. ఈలోపు కంగారుపడి చావువస్తే బాగుండును అనుకొన్నా చావురాదు. అందరిచేత మాటలు అనిపించుకొంటే గాని మనకు బుద్ధిరాదు. మనకు అనేకరకాల అనుభవాలు కలుగుతాయి. అన్ని అనుభవాలను సమానంగా తీసుకోవాలి. ఆ అనుభవాలనుండి పాఠాలు నేర్చుకొంటే మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది, జ్ఞానం కలుగుతుందిగాని పాండిత్యం వలన జ్ఞానం రాదు. ఇప్పడు మనం దేహంగా జీవిస్తున్నాము, మనస్సుగా జీవిస్తున్నాము. అనుభవాలనుండి పాఠాలు నేర్చుకొంటే చైతన్యంగా జీవించేశక్తి మనకు కలుగుతుంది. భగవంతుడు ఒకోసారి కష్టాలను పంపుతాడు అవి మనకు వరాలు అనే సంగతి మనకు తెలియటంలేదు. మన చైతన్యస్థాయిని పెంచటంకోసం ఆ కష్టాలను పంపుతాడు. అందువలన ఇతరులను విమర్శించకుండా మీ ప్రారబ్ధాన్ని మీరే విమర్శించుకొని అందులోనుండి పాఠాలు నేర్చుకోవాలి. అలా పాఠాలు నేర్చుకొంటే వివేకం పెరుగుతుంది, వైరాగ్యం పెరుగుతుంది, హృదయంలో భగవంతుడు ఎంతలోతులలో ఉన్నాడో అంతలోతులలోనికి వెళ్ళటానికి మనకు శక్తి కలుగుతుంది. ఈ పంచభూతాలను ఎవడైతే నియమిస్తున్నాడో వాడే ఈ జీవుడిని కూడా నియమిస్తున్నాడు. ఈ లోకానికి యజమానికూడా ఆయనే. ఆయనకు శరణాగతి పొందితే ప్రారబ్ధం నిన్ను ఏమీ చేయలేదు. ప్రారబ్ధం అనుభవించటానికి

5-6-2000

దొంగనేను ఉండాలి. ఆ దొంగనేనును తీసుకొని వెళ్ళి ప్రభువుపాదాల దగ్గర ఉంచితే ప్రారబ్దం అనుభవించేవాడు ఇక ఉండడు. సబ్జక్టు సరిగా అర్థం చేసుకోవాలి. సబ్జక్టు నీకు ప్రోపర్‌గా అర్థమవుతూ ఉంటే నీకు ధనం ఉన్నాలేకపోయినా, పాండిత్యం ఉన్నాలేకపోయినా జీవించి ఉన్నంతకాలం సుఖంగా జీవించవచ్చు. నేను ప్రారబ్దం అనుభవిస్తున్నాను అంటే నీవు ఇంకా శరణాగతి పొందలేదు అని అర్థం.

ధ్యానం చేసినా, జపం చేసినా, విచారణ చేసినా మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, మనస్సు సూక్ష్మమవుతుంది. మనస్సు నిర్మలమవుతుంది. జపం చేయగా చేయగా ఉపయోగంలేని తలంపులు ఆగిపోతాయి. మనం తలంపువచ్చాక మాట్లాడతాము, తలంపువచ్చాక పని చేస్తాము. ఎప్పుడైతే మనకు ఉపయోగంలేని తలంపులు రావో ఉపయోగంలేని మాటలు మాట్లాడము, ఉపయోగంలేని పనులు చేయము. తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉంటే శరీరం చనిపోయిన తరువాత ఏమౌతాము అనేగొడవ అటు ఉంచండి ముందు జీవించి ఉన్నంతకాలం ఇక్కడ సుఖంగా ఉంటాము. సబ్జక్టు మీకు అర్థమవుతూ ఉంటే పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీరు సుఖంగా జీవించవచ్చు. కొంతమంది చనిపోయేవరకు కబుర్లతో కాలక్షేపం చేసేస్తారు, క్రియాత్మకంగా ఏమీ ఉండదు. కబుర్ల వలన మీరు ఐశ్వర్యాన్నే సంపాదించలేరు, మోక్షం ఎలా వస్తుంది. కొంతమంది ఎంతసేపు ఎవరో ఒకరిని విమర్శిస్తూ కాలక్షేపం చేస్తారు, వారి వలన ఏమీ అవ్వదు అటువంటి వారిని చూసి మన మనస్సు పాడుచేసుకోకూడదు. అనుభవం రావటం చాలాకష్టం, అనేక జన్మలలో కష్టపడి ప్రాక్టీసుచేస్తేగాని అనుభవం రాదు. ఎవరి అనుభవం వారిది, ఒకరి అనుభవం మరొకరికి రాదు. సత్పురుషులు దగ్గరగా ఉన్నప్పటికి మనకు పుణ్యబలం లేకపోతే వారితో స్నేహం చేయలేము. సత్పురుషులను పట్టుకొని వేలాడుతూ ఉంటే వారి సహవాసంవలన నీకు మోక్షం వచ్చేస్తుంది. జపంవలన, ధ్యానం వలన, విచారణవలన బుద్ధిసూక్ష్మత పెరుగుతుంది. బుద్ధిసూక్ష్మత పెరిగేకొలది పదార్థంలోనుండి పరమార్థంలోనికి వస్తారు. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. మనస్సుకు ఏకాగ్రత పెరిగేకొలది ఆ ఆకర్షణలనుండి బయటకు వచ్చి పరమాత్మవైపుకు, హృదయం యొక్క లోయలలోనికి ఉపసంహరింపబడుతూ ఉంటుంది. అప్పుడు మనస్సు దేనిని తలపోయదు. పరమాత్మ రుచి దానికి తెలిసినప్పుడు ఎక్కడికైనా పో అన్నా అదిపోదు. వాసన యొక్క వేగం వలన హృదయంలో సత్యవస్తువు ఉన్నప్పటికి అది మనకు తెలియటంలేదు. ఏవాసన అయితే మిమ్మల్ని ఇబ్బంది పెడుతోంది ఆ వాసనను పట్టుకొని దానిని తొలగించుకొంటే ఈ శరీరం ఉండగానే సత్యవస్తువు మీక

వ్యక్తమవుతుంది

రోజుకు ఎన్ని గంటలు ధ్యానం చేయమంటారు అని అడుగుతున్నారు. దానికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ప్రత్యేకంగా చేసేది ఏమిటి? నీ స్వభావమే ధ్యానం కదా. లోపల ధ్యానం జరుగుతూనే ఉంటుంది, ఆ ప్రవాహాన్ని నీవు పట్టుకోవాలి. మనస్సు అణగితే ఆ ప్రవాహం నీకు తెలుస్తుంది. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఎన్ని జన్మలలో పుణ్యకర్మలు చేసినా, అధ్యయనం చేసినా సాక్షాత్కారం అనేది హృదయంలోనే కలగాలి. అనేక జన్మలు సాధకులుగా ఉంటే ఏదో జన్మలో వాడికి హృదయంలో తళుక్కున ఆత్మసాక్షాత్కారం అవుతుంది. మోక్షం పేరు మీద కుటుంబాన్ని త్యజించి పారిపోవటం ధర్మమేనా అని అడుగుతున్నారు. త్యజించటం, త్యజించకపోవటం అనేది మనచేతులలో లేదు. దేహప్రారబ్ధమును బట్టి అది జరుగుతుంది. దేహప్రారబ్దంలో మనం ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటాము. ధర్మం అంటే కుటుంబంకోసం మనస్వార్థాన్ని త్యాగం చేయాలి, గ్రామం కోసం కుటుంబం యొక్క సౌఖ్యాన్ని త్యాగం చేయాలి. దేశంకోసం మన గ్రామం యొక్క సౌభాగ్యాన్ని త్యాగం చేయాలి. ప్రపంచం కోసం దేశ సంపదను త్యాగం చేయాలి. అది ధర్మం. కాని ఆత్మజ్ఞానం కోసం, మోక్షంకోసం అవసరమైతే ప్రపంచాన్ని త్యజించు. కొంతమందికి విచారణ అక్కరలేదు, ధ్యానం అక్కరలేదు, ధర్మం అక్కరలేదు, బజారు నుండి ఏదైనా తెచ్చుకొంటే అంతావాళ్ళే తినేస్తారు. ఇంటిలోనివారి గొడవే వారికి ఉండదు. ఇంకవారికి భక్తి ఏమిటి? వారికి ధర్మం ఏమిటి? ధర్మం అంటే మన డ్యూటీ మనం సక్రమంగా చేయటం, శరీరం ఎక్కడ ఉంది అనేది ప్రధానం కాదు. భగవంతుడు నీకు ఏ డ్యూటీ అయితే అప్పగించాడో నీవు దానిని సక్రమంగా చేయటం. మన డ్యూటీ మనం సక్రమంగా చేస్తే మనలను చూసి ఇతరులు కూడా సక్రమంగా పనిచేస్తారు.

కర్తృత్వం ఉన్నంతకాలం కోరికలు వస్తూనే ఉంటాయి. కర్తృత్వబుద్ధి నశించి ఆత్మబుద్ధి కలిగే వరకూ కోరికలు రాకుండా ఎవరూ ఆపుచేయలేరు. మనం కుటుంబాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయినా మన మనస్సు మనకూడా వస్తుంది, మన అలవాట్లు మనకూడా వస్తాయి. సంసారం అంటే కుటుంబం కాదు. మనస్సే సంసారం. మనస్సు నశిస్తే సంసారం లేదు. తగిన మెచ్యూరిటీ లేకుండా గృహాన్ని త్యాగం చెయ్యకూడదు. గృహాన్ని ఎప్పుడు త్యాగం చేయాలంటే మరల గృహం నీకు జ్ఞాపకం రాకూడదు. నీపట్ల ఎదుటివారు ఎలా మాట్లాడితే నీకు ఇష్టం ఉండదో నువ్వుకూడా ఇతరుల పట్ల అలా మాట్లాడకూడదు. ఇంట్లో పేచీలకు, చిక్కులకు అన్నింటికి అహంకారమే కారణం. అహంకారం అణిగిపోతే అన్నీ అణిగిపోతాయి.

అహంకారాన్ని పెంచుకోవద్దు, దాని మూలాన్ని వెదుకు. దాని మూలంలోనే ఆత్మ ఉంది. అహంకారం యొక్క మూలం తెలియకుండా ఆత్మ తెలియదు, నీకు మోక్షస్థితి రాదు. అహంకారాన్ని దానిమూలం వరకు ఉపసంహరించుకొంటూ వెడితే అప్పుడు ఆత్మ తెలియబడుతుంది. దానిని ఉపసంహరించకపోతే ఏదో పేచీలు పెడుతూనే ఉంటుంది. భగవంతుడు ఏ వాక్యం అయితే చెప్పాడో దానిని శ్రద్ధగా శ్రవణంచేయాలి, దానిని ధ్యానం చేయాలి, ఆ వాక్యం యొక్క విలువ తెలియాలి. జ్ఞానుల యొక్క బోధలు అహంకారన్ని అణచగలవు. వాటిని విశ్వసించి ప్రాక్టీసుచేస్తే అహంకారం పల్చబడి దాని మూలంలోనికి వెళ్ళిరాలిపోతుంది. అప్పుడు దాని మూలంలో ఉన్న చైతన్యం నీకు తానుగా వ్యక్తమవుతుంది.

ఏనుగు నిద్రపోతూ ఉంటే దానికి సింహం స్వప్నంలోనికి వస్తే వెంటనే మెలుకువ వస్తుంది. అజ్ఞానంలో నిద్రపోయే జీవుడికి గురువు అనుగ్రహం సింహం వంటిది. గురువు అనుగ్రహం లేకపోతే అజ్ఞానంనుండి బయటకు రాలేము. గురువు అనుగ్రహం ఎంతకాలానికి లభిస్తుంది అని అడుగుతున్నారు. గురువు అనుగ్రహం ఎప్పుడు లభిస్తుంది అని తెలుసుకోవటం వలన నీకు ఏమి కలిసివస్తుంది. దానికి టైములేదు. గురువుకు శరణాగతి పొందటమే. శరణాగతి పొందినవాడిని ప్రారబ్దం ఏమీ చేయలేదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలనుకొనేవారికి సహనం అవసరం. ప్రపంచాన్ని చూచేవాడు ఎంతనిజమో చూడబడేది కూడా అంతేనిజం. చూచేవాడిని తీసేస్తే చూడబడేది ఏదీలేదు. అంతా తానే. మన హృదయంలో శాంతి సముద్రం ఉన్నప్పటికి అహంకారం వలన అది మనకు అందటం లేదు. మన హృదయంలో ఉన్న శాంతి మనకు అందేవరకు బయట మనుషుల మీద, వస్తువుల మీద సుఖంకోసం ఆధారపడి ఉంటాము. ఈ అనుబంధాలు ఏదోరోజు తెగిపోతాయి, ఈ అనుబంధాలు దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఇతరుల మీద ఆధారపడిన సుఖం స్వతంత్రమైనదికాదు. హృదయంలో ఉన్న శాంతి మాత్రమే స్వతంత్రమైనది. ధనం సంపాదించటంకంటే, విద్యను సంపాదించటంకంటే మానవుడు తన స్వభావం మార్చుకోవటం చాలాకష్టం. స్వభావం మనకు ఎలా ఏర్పడుతుంది అంటే మనకోరికలను బట్టి, వాసనలను బట్టి, పూర్వజన్మలలో మనం చేసిన పనులనుబట్టి మనకు స్వభావం ఏర్పడుతుంది. ఆ స్వభావం మార్చుకోవటం చాలా కష్టం స్వభావం మార్చుకొంటేగాని నీ ముఖం మోక్షం వైపుకు తిరగదు. స్వభావం మార్చుకోవటానికి ఎంతో సహనం ఉండాలి, ఎందుచేతనంటే తనతో తను పోరాడాలి. స్వభావం మారాలంటే స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం ఈమూడూ ఉండాలి. ఏమాటవింటే మీకు వివేకం కలుగుతుందో, మీకు శాంతి కలుగుతుందో ఆ మాటలనే శ్రవణం చేయాలి, వాటినే మననం చేయాలి, ధ్యానం చేయాలి. భగవంతుడు వేరు,

ఆయన చెప్పిన మాట వేరు కాదు. రెండూ సమానమే. భగవంతుని హృదయమే ఆ మాట. ఆ మాటను ధ్యానం చేసినా మీకు శాంతి కలుగుతుంది. శాంతిని పోగొట్టుకోవద్దు. ప్రపంచంలో శాంతితో సమానమైన వస్తువు ఏదీ లేదు. పరమాత్మయొక్క స్వరూపమే శాంతి. అది మన హృదయంలో ఉంది. అది మనకు అందకపోవటానికి కారణం అహంకారము. దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు. దానిని తీసి ప్రక్కన పెట్టటానికి వైరాగ్యం ఉండాలి.

మనకు ఏదైనా వాసన ఉంది అనుకోండి. శరీరం శవం అవ్వకముందే ఆ వాసన యొక్క వేగాన్ని తొలగించుకోలేము అనుకోండి, మన శరీరాన్ని జలగపట్టుకొంటే ఎలా పీడిస్తుందో అలాగ మరణానంతరము వాసన ఆ జీవుడిని పీడిస్తుంది. సాధ్యమైనంత వరకు పరమేశ్వరుని పాదాలను ఆశ్రయించి వాసనను ఇక్కడే పోగొట్టుకోవాలి. వాసన ఇప్పుడు నశించకపోతే నిప్పు మీద చెయ్యివేస్తే ఆ చెయ్యికాలి ఎంత బాధపెడుతుందో మరణానంతరము వాసన ఆ జీవుడిని అంతబాధ పెడుతుంది. అందుచేత ఇప్పడే వాసనను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఒక్క కర్ణుడు వలన యుద్ధాన్ని జయించవచ్చు అనుకొన్నాడు ధుర్యోధనుడు. అటువైపు సారథి పరమాత్మ, జీవకోటికి కంట్రోలర్ ఆయనే. ధుర్యోధనుడు పదార్ధాన్ని చూస్తున్నాడు గాని పరమార్ధాన్ని చూడటంలేదు. ఈ మేటర్ అంతా కూడా పరమాత్మ కంట్రోల్‌లో ఉంది అన్న సంగతి ధుర్యోధనుడు మిస్ అయ్యాడు. ధుర్యోధనుడు పరమాత్మ అయిన కృష్ణుడిని ఎలా మిస్ అయ్యాడో కర్తృత్వం పెట్టుకొంటే మనం కూడా అలా మిస్ అవుతాము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-5-2000, సిద్ధాంతం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బహుజన్మలలో పుణ్యకర్మలు చేస్తే, బహుజన్మల యొక్క సాధనాఫలితంగా, బహుజన్మల యొక్క విచారణాఫలితంగా ఏదో ఒక జన్మలో నీకు జ్ఞానం కలుగుతుంది. సాధనకు అనేక జన్మలు పట్టినా జ్ఞానం రావటానికి అనేక జన్మలు పట్టదు, కొన్నిక్షణాలలో జ్ఞానం వస్తుంది అని భగవంతుడు గీతలో చెప్పాడు. తల్లిని గౌరవించు, తండ్రిని గౌరవించు, గురువుని గౌరవించు, అతిథిని గౌరవించు అదికూడా సాధనలో ఒకభాగము అని ఉపనిషత్‌లలో చెప్పాడు. మీకు తెలిసిన విద్య, మీరు నేర్చుకొన్న విద్య ఎవరైనా శ్రద్ధగలవారు అడిగితే బోధించండి, అందులో అశ్రద్ధ పనికిరాదు, శ్రద్ధగా బోధించండి.

అది కూడా సాధనలో భాగమే, దానివలన ఈశ్వరుని కృపకు పాత్రులవుతారు. దేహప్రారబ్ధంలో ఏపని అయితే మనము చేయవలసి ఉందో ఆపనిని శ్రద్ధగా చేయండి, ఇష్టంతో చేయండి, ప్రేమతో చేయండి. చేతులతో పనిని శ్రద్ధగా చేసుకొంటూ, మనస్సులో మీ గురువునుగాని, ఈశ్వరునిగాని స్మరించుకొంటూ ఉంటే జ్ఞానము కలగటానికి మీ మనస్సు ప్రిపేర్ అవుతుంది. కర్మవిషయంలో, భక్తి విషయంలో అశ్రద్ధపనికిరాదు, ఇందులో జాగ్రత్తగా ఉంటే జ్ఞానం కలుగుతుంది. మనం చనిపోయిన తరువాత ఏదో సాధించాలి అనుకొంటాము. చనిపోయిన తరువాత మనవల్ల ఏమీ అవ్వదు. చనిపోయిన తరువాత మీరు శాశ్వతమైన శాంతిలో, సుఖంలో, ఆనందంలో ఊగిసలాడాలంటే అది మీ శరీరం ఉండగానే పొందండి. శరీరానికి మరణం రాకముందే మనం ఆనందాన్ని పొందలేము అనుకోండి మరణించిన తరువాత ఆనందం మటుకురాదు. చనిపోయేముందు మీరు ఏ స్థితిలో ఉన్నారో ఆ స్థితే మరణానంతరం కంటిన్యూ అవుతుంది కాని కొత్తగా మీరు పొందేది ఏదీ లేదు? ఒక్క ఆత్మజ్ఞానం వలననే అజ్ఞానం నశిస్తుంది. ఆత్మజ్ఞానం కావాలంటే ఈ శరీరంతో భగవంతుడు మీకు ఏపని అయితే విధించాడో ఆపని శ్రద్ధగా చేసుకొంటూ, మనస్సులో భగవంతుని నిరంతరము స్మరించుకొంటూ ఆత్మజ్ఞానము పొందటానికి మీ శరీరాన్ని, మనస్సును సిద్ధం చేసుకోవాలి. చాలామంది ఏమనుకొంటారు అంటే మరణానంతరం ఏదో వచ్చేస్తుంది అనుకొంటారు. ఏదీరాదు, చివరకు సున్న మిగులుతుంది. పొందేది ఏదో ఇప్పుడే ఈ శరీరం ఉండగానే పొందాలి.

వాసన నశిస్తేగాని మనోనాశనం కాదు, మనస్సు నశిస్తేగాని మనోమూలంలో ఉన్న ఆనందం మీకు అనుభవంలోనికిరాదు. ఇప్పుడు ఆనందం అనుభవంలోనికి వస్తేగాని మరణానంతరం మీరు ఆనందంలో ఉండలేరు. ఆనందం ఇప్పుడు పొందితే అది మరణానంతరం కంటిన్యూ అవుతుంది. మరణానంతరం తెచ్చుకొనేదికాదు. నీ గురువునుగాని, ఈశ్వరునిగాని ఆరాధించి వాసన నశింపచేసుకొని అమృతానుభవాన్ని పొందు. ఇప్పుడే ఈ శరీరం భూమిమీద తిరుగుతున్నప్పుడే దానిని పొందు. ఎప్పుడోకాదు, ఇప్పుడు రానిది అప్పుడు రాదు. ఇక్కడ రానిది అక్కడ రాదు. అందుచేత రోజులు బహుజాగ్రత్తగా గడపండి, కాలాన్ని పాడుచేసుకోవద్దు. గురువుయందు ప్రేమ, ఆప్యాయత, గౌరవం లేకపోతే నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ధర్మాన్ని ఆచరించటంలో అజాగ్రత్త పనికిరాదు. ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే మోక్షం యొక్క విలువ నీకు తెలుస్తుంది. మోక్షం యొక్క విలువ తెలిసినవాడు ముముక్షువు అవుతాడు. ముముక్షువు మోక్షానుభవాన్ని పొందుతాడుగాని అందరూ పొందలేరు. మనకు ఎందుకు జ్ఞానంరావటంలేదు అంటే

ఏ విషయాలను అయితే మనం గౌరవించకూడదో వాటిని గౌరవిస్తున్నాము, ఏ విషయాలను అయితే గౌరవించాలో వాటిని గౌరవించటంలేదు. మనకు ఈ శరీరంమీద ఉన్నగౌరవం, వాసనమీద ఉన్నగౌరవం చైతన్యంమీదలేదు, పరమాత్మమీదలేదు. ఆయన మీద గౌరవంలేదుకాని ఆయనను పొందాలని ప్రయత్నం చేస్తున్నాము. మనపద్ధతి పరస్పర విరుద్ధంగా ఉంది.

లౌరి అని అమెరికా దేశస్థుడు రెండు నెలలు రమణాశ్రమంలో ఉండి తిరిగి వెళ్ళేటప్పుడు చెప్పటానికి భగవాన్ దగ్గరకు వచ్చాడు. ఇక్కడ నుండి విడిచి వెళ్ళటం కష్టంగా ఉందికాని స్వదేశం వెళ్ళవలె. అందుచేత సద్గురువు యొక్క సందేశాన్ని అర్థిస్తున్నాను. ఈ చివరి టైములో ముగింపు మాటలు ఏవైనా చెపితే అవి జ్ఞప్తిలో ఉంచుకొంటాను, నాహృదయంలో పదిలం చేసుకొంటాను అని లౌరి భగవాన్‌తో చెపుతున్నాడు. మీ మాటలు నేను ఎందుకు అడుగుతున్నాను అంటే నేను దూరంగా వెళుతున్నాను, దూరంగా వెళ్ళేరోజులలో మీరు మంచి మాటలు చెపితే అవి నన్ను ఆదుకొంటాయి, అజ్ఞానంలో పడకుండా చూస్తాయి. నా అజ్ఞానమును పోగొట్టుకోవటానికి సహకరించే నాలుగు మాటలు ముగింపుగా ఈ వీడ్కోలు సమావేశంలో మిమ్మల్ని అడుగుతున్నాను అని లౌరి చెప్పాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే సద్గురువుకు దూరంగా వెళ్ళిపోతున్నాను అని నీవు అనుకొంటున్నావు. సద్గురువు నీకు వెలుపల లేడు. ఆయన అంతటా ఉన్నాడు, లోపల ఉన్నాడు, బయట ఉన్నాడు, నీకూడా ఉన్నాడు. నువ్వు ఈ శరీరమే అని అనుకోవటం వలన సద్గురువును కూడా శరీరంగానే చూస్తున్నావు. గురువు అంటే ఆత్మ. ఆత్మ అంతటా ఉంది. అంతటా ఉన్న వస్తువుకు దూరం ఏమిటి? దగ్గర ఏమిటి? సద్గురువు అంటే ఆ శరీరం అనుకొంటున్నావు. ఆ శరీరానికి దూరమయిపోతున్నావు కాబట్టి సద్గురువుకు దూరమయిపోతున్నాను అని నీవు అనుకుంటున్నావు. సద్గురువు అంతటా లేడా? సద్గురువు అంటే ఏమిటి, ఆత్మ అంటే ఏమిటి? దానికి సంబంధించిన అవగాహన లేకుండా నీకు అజ్ఞానం నశించదు. నీ లోపల ఉన్న ఆత్మే సద్గురువు. ఆత్మగురించి బహుజన్మలు తపించగా, తపించగా ఆత్మే గురురూపం ధరించి వచ్చి ఆత్మగురించి ఆత్మే బోధిస్తుంది.

విషం కంటే విషయం ఇంకా ప్రమాదకరమైనది. విషాన్నిచూస్తే చనిపోము, విషాన్ని మింగితే చనిపోతాముకాని విషయాన్ని మింగనక్కరలేదు విషయాన్నిచూస్తేనే అజ్ఞానము ఆవరిస్తుంది అని స్వామీజీ చెప్పారు. గురువు అంటే విద్యాస్వరూపుడు, ఆనందస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు. ఆనందం ఎవరైతే అనుభవిస్తున్నారో వారు ఆనందంగురించి చెపితే దాని విలువ మనకు తెలుస్తుంది కాని లోపల దుఃఖం పెట్టుకొని ఆనందం గురించి చెపితే

దాని విలువ మనకు తెలియదు. నిజమైన గురువు నీలోపలే ఉన్నాడు. నీవు లోపల వెతుకు. నీ లోపల ఉన్న గురువును తెలుసుకో. కేవలము భక్తుల కోసమే ఆయన శరీరం ధరించి వస్తాడు, ఆ శరీరానికి అనుభవించటానికి ప్రారబ్దం ఏమీ లేదు. నీవు లోపలకు వెళ్ళటానికి బరువు ఉండాలి, సంస్కారం ఉండాలి, సభ్యత ఉండాలి లేకపోతే నీవు లోపలకు వెళ్ళలేవు. మీరు సాధన చేసేటప్పుడు ఎవరైనా మిమ్మల్ని తిట్టారు అనుకోండి వారిమీద మీకు కోపం వస్తోంది అనుకోండి మీరు బయటకు వచ్చేస్తారు ఇంక లోపలకు ఎలా వెళతారు. సాధన చేసేటప్పుడు అనేక పరీక్షలు వస్తాయి, అవి అన్నీ తట్టుకోవాలి. సాధకుడికి బరువు ఉండాలి. బరువు లేకుండా, అర్హత లేకుండా, యోగ్యత లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. రాగాన్ని, భయాన్ని, కోపాన్ని తగ్గించుకో. అవి పల్చబడేటట్లు చూసుకో. నీవు లోకాన్ని విచారణ చేస్తే లోకజ్ఞానం కలుగుతుంది. వస్తువు నీ హృదయం యొక్క లోయలలో ఉంది. నీవు లోపల వెతకాలి. నీవు ఒక గజం వెళ్ళి, రెండు గజాలు వెళ్ళి వస్తువులేదు అని వచ్చేస్తున్నావు. నీవు ఆత్మను విడిచి ఎంతదూరం వచ్చావో అంతదూరం వెనుకకు వెళితేనేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. ఏ ఒక్క ఆకర్షణకు లొంగిపోయి వెనక్కి వచ్చేసినా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. హృదయంలో ఉన్న ఆనందం చేతికి అందినవాడికి చావువచ్చినా భయంకలుగదు ఎందుచేతనంటే వాడి శరీరం పోయినా ఆనందం కంటిన్యూ అవుతుందని వాడికి తెలుస్తూ ఉంటుంది.

నీవు నన్ను సందేశం అడుగుతున్నావు. సందేశం ఎప్పుడూ నీలోనే ఉంది. నీవు నిర్మలంగా ఉంటే నీహృదయమే చెపుతుంది. నీళ్ళు నిర్మలంగా ఉంటే నీటిలో ఉన్న వస్తువు మనకు కనబడుతుంది అలాగే మన మనస్సు నిర్మలంగా, నిశ్చలంగా ఉంటే లోపల ఉన్న వస్తువు నీకు తెలుస్తూ ఉంటుంది, సందేశంకూడా నీకు అందుతూ ఉంటుంది. సందేశం ఇచ్చేవాడు లోపలే ఉన్నాడు. నిన్ను గైడ్ చేసేవాడు బయటలేడు లోపలే ఉన్నాడు. నీకు గైడెన్స్ బయటనుండి వస్తుంది అనుకోకు లోపలనుండే గైడెన్స్ వస్తుంది. లోపల ఉన్న చైతన్యం యొక్క రుచి నీకు తెలిసింది అనుకో అది పూర్తిగా అనుభవంలోనికి వచ్చేవరకూ అది నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. గురువు ఎప్పుడూ నిన్ను విడిచిపెట్టడు. గురువు అంటే ఆత్మ. ఆత్మ అంతటా ఉంది. అంతటా ఉన్న వస్తువును విడిచిపెట్టి నీవు ఎక్కడికి వెళ్ళిపోతావు. బ్రహ్మం ఉందా అని భగవాన్‌ను అడిగితే బ్రహ్మం ఉంది అని ఆయన చెప్పలేదు ఉన్నదే అది అని చెప్పేవారు అంటే అది తప్ప మిగతావి ఏమీలేవు అని చెప్పటం. ఉన్నది అదే అయితే అది నీకు ఎందుకు అనుభవంలోనికి రావటం లేదు అంటే దానికి నీ మనస్సే కారణం. ఒకో ఇంద్రియానికి ఒకోరుచి కావాలి. ఇంద్రియాలద్వారా మనస్సు బయటకు

వెళ్ళిపోతుంది. నీవు దానితో విరోధం పెట్టుకోవద్దు, దానితో స్నేహంగా ఉండు. దానిని మచ్చిక చేసుకొని దానిని లోపలకు ఉపసంహరించు. మనస్సును నీ హృదయంలోనికి వెళ్ళేవరకు దానిని ఉపసంహరించు. అదే సాధన. నీవు ప్రయత్నం చెయ్యి. నీవు చేసే ప్రయత్నాన్ని లోపల ఉన్న ఈశ్వరుడు చూస్తాడు. అప్పుడు ఆయన అనుగ్రహాన్ని పంపిస్తాడు, నీ మనస్సును ఆయనే మింగేస్తాడు అప్పుడు నీవు జ్ఞానివై కూర్చొంటావు.

మనం నేను, నేను అంటాము అది అహంవృత్తి. ఈ అహంవృత్తి తెగేవరకూ నీ మనస్సు ఇంద్రియాల ద్వారా విషయాల మీదకు వాలుతూ ఉంటుంది. నీకు ఎన్ని తలంపులు వచ్చినా అవి నేను అనే తలంపుకు వస్తున్నాయి. ఆ తలంపు తెగిపోతే నీకు లోపల ఉన్న వస్తువు తానుగా వ్యక్తమవుతుంది. నీవు వైరాగ్యాన్ని ప్రాక్టీసు చేసి దానిని కత్తిరించగలిగితే లోపల ఉన్న జ్ఞానగంగ వరద వచ్చినట్లుగా వచ్చి నీ సహస్రారాన్ని ముంచివేస్తుంది. అప్పుడు నీ మనస్సును ఇంద్రియాల ద్వారా విషయాల మీదకు వెళ్ళమన్నా అది వెళ్ళదు ఎందుచేతనంటే అది జ్ఞానగంగలో ఊగిసలాడుతూ ఉంటుంది. గంగానదిలో స్నానం చేస్తే మన మనస్సులో ఉన్న దోషాలు అన్నీపోతాయి అనుకొంటాము కాని ఒక సత్పురుషుడు వచ్చి గంగానదిలో స్నానం చేస్తే ఆనదికి ఉన్న దోషాలు పోతాయి, సత్పురుషుడు యొక్క వైభవం అటువంటిది. నీవు లోచూపు అలవాటు చేసుకో. దాని వలన వివేకం పెరుగుతుంది. లోచూపు ఉన్నవారికి ఆవేశం తక్కువగా ఉంటుంది, ఆలోచన ఎక్కువగా ఉంటుంది. ఆవేశం కంటే ఆలోచన మంచిది. కాని నీవు ఆవేశంలో నుండి, ఆలోచనలోనుండి కూడా విడుదల పొందాలి. ఆలోచన నీ స్వరూపంకాదు, ఆలోచన నిజంకాదు. గాఢనిద్రలో నీ మనస్సు హృదయంలో ఎలా ఉండగలుగుతోందో అలాగ జాగ్రదవస్థలో నీమనస్సు హృదయంలో ఉండగలిగితే గురువే ఆత్మ అని, ఆత్మ తప్పించి ఇంకేమీ లేదని నీ అంతట నీకు తెలుస్తుంది. ఎవరిమీద ఆధారపడనక్కరలేదు, శాస్త్రం మీద కూడా ఆధారపడనక్కరలేదు. అప్పుడు నువ్వు ఏది చెపితే అదే శాస్త్రం అవుతుంది. గురువు నీకూడానే ఉంటాడు. గురువుకు దూరంగా ఉండాలని నీవు ప్రయత్నం చేసినా నీవు ఉండలేవు. అంతటా ఉన్న వస్తువును విడిచిపెట్టి ఎక్కడకు వెళ్ళగలవు. నేను ఏ ప్రదేశంలో ఉన్నా నిరంతరము మీ అనుగ్రహము నా శిరస్సుమీద ఉండాలి అని ప్రార్థిస్తున్నాను అని లౌరి భగవాన్‌కు నమస్కరించాడు. ఆయన నేత్రాలలో భగవాన్ పట్ల భక్తి, ప్రేమ పొంగి ప్రవహించింది. సత్యాన్ని తెలుసుకోండి అని మీరు బోధిస్తున్నారు. మీరు బోధిస్తే సరిపోదు, సత్యాన్ని తెలుసుకొనే శక్తిని అనుగ్రహించండి. ఆ శక్తి సహాయంతో సత్యాన్ని అర్థం చేసుకొని, దానిని అనుభవించి, ఆనందాన్ని రుచి చూడగలను అందుచేత

మీరు నాకు శక్తిని ప్రసాదించాలి అని లౌరి భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు ఆత్మకు దూరంగా ఉన్నాను అనుకొంటున్నావు. ఆత్మకు దూరంగా ఒక్క క్షణం కూడా ఉండలేవు. నీవు ఆత్మే అయినప్పుడు ఆత్మకు వేరుగా నీవు ఎలా ఉండగలవు. నీవు కాని దానిలో నుండి విడిపోగలవు గాని నీవు ఏదైతే అవునో దానిలో నుండి ఎలా విడిపోగలవు. నువ్వు ఆత్మకోసం ప్రయత్నం చేస్తూ ఉంటే శక్తి అందులోనుండే వస్తుంది. ఆత్మశక్తి లేకుండా లేదు. శక్తి జీవుడిదికాదు, శక్తి దేవుడిది. అప్పుడు లౌరి ఏమిచెపుతున్నాడు అంటే ఎవడైతే సత్యాన్ని అనుభవిస్తున్నాడో వాడు శాంతితో, ఆనందంతో ఈ లోకాన్ని నింపుతాడని చెపుతుంటే విన్నాను. బహుశా మీ ప్రేమకూడా అటువంటిది. మీ ప్రేమకు పరిమితులు లేవు. చైతన్యం యొక్క స్వరూపమే ప్రేమ. మీరు ఎవరు చైతన్యమే. చైతన్యం అంతటా ఉంది కాబట్టి మీప్రేమనా మీద కూడా ఉంటుంది కాబట్టి ప్రత్యేకంగా అర్థించనక్కరలేదు. మా మీద ప్రేమకొలది మీరు శరీరం ధరించారుగాని లేకపోతే ఆ శరీరాన్ని మీరు ఏమిచేసుకొంటారు. ప్రేమే శరీరం ధరించి వచ్చింది. జీవకోటికి ఉపకారం చేయాలని మీరు అనుకోనక్కరలేదు మీ ద్వారా జరిగేది అదే అని లౌరి అంటున్నాడు.

శారీరక ఆరోగ్యం కాపాడుకో, మానసిక ఆరోగ్యం కాపాడుకో, ధర్మాన్ని ఆచరించు, శ్రద్ధగా ఇయ్యి, ప్రేమగా ఇయ్యి, తృప్తిగా ఇయ్యి. ఇవి అన్నీ ఆత్మజ్ఞానానికి ఉపయోగపడతాయి కాబట్టి ఇవి అన్నీ చెపుతున్నాను గాని ఈ మాటలే గమ్యం కాదు. ఆత్మజ్ఞానం మానవుడి యొక్క గమ్యం. ఆత్మజ్ఞానం పొందకుండా ఏదిసాధించినా స్వప్నముతో సమానము. నువ్వు మంచిగా ఉండు. నువ్వు ఏశక్తినయితే నమ్ముకొన్నావో ఆశక్తే నువ్వు ఎక్కడ ఉన్నా నిన్ను ఉద్దరిస్తుంది. నువ్వు దేనికైతే శరణాగతి చెందావో ఆ వస్తువు తెలివి తక్కువది కాదు, నీకంటే తెలివైనదే. నిన్ను ఎప్పుడు ఎక్కడ ఎలామలుపు త్రిప్పాలో అలామలుపు త్రిప్పి నిన్ను ఉద్ధరిస్తుంది. నువ్వు తొందరపడకు, వేగిరపడకు. ఆ శక్తే సర్వము చూసుకొంటుంది, నీ వ్యవహారాలు కూడా చూసి పెడుతుంది. నువ్వు కర్తను అనుకోకు. కర్తను అనుకొంటే కర్మఫలం అనుభవించవలసివస్తుంది. కర్తృత్వం విడిచిపెట్టు. ఈశ్వరుని చేతిలో ఒక పనిముట్టుగా ఉండు. ఎప్పుడైతే ఈశ్వరునికి శరణాగతి పొందావో అంతా ఈశ్వరుడు చేస్తున్నాడు, అంతా ఆయన సంకల్పం ప్రకారం జరుగుతోంది అని నీకు అనుభవంలోనికి వస్తుంది. అప్పుడు కర్తృత్వం నశిస్తుంది. కర్తృత్వం నశించిన మరుక్షణంలో దుఃఖం కూడా నశిస్తుంది, ఆనందానుభవం కలుగుతుంది.

అరుణాచల శివ    అరుణాచల శివ    అరుణాచలా

# శ్రీ నాన్నగారి హరద్వార్, ఋషికేష్, బదరీనాథ్ ప్రయాణ విశేషాలు

స్వర్గభూమి, దేవతల భూమిగా పేరుగాంచి హిమాలయాలకు ద్వారంగా నిలచిన పుణ్య భూమినుండి వైష్ణవుల అష్టాక్షరీ క్షేత్రమైన బదరీనాథ్ వరకు ఉన్న పలు పుణ్యక్షేత్రాలు సందర్శించిన శ్రీ నాన్నగారు రమణభాస్కర ఎడిటర్‌తో అనేక విషయాలు ముచ్చటించారు. భారతావని శిరోభాగమైన హిమాలయాలలో ౩౦౦ కిలోమీటర్ల ఘాట్‌రోడ్‌లో వేంచేసియున్న ఈ పవిత్ర క్షేత్రాలు హిందూసంస్కృతికి భారతదేశ ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచాయని ఆయన తెలిపారు. రమణ భక్తుడు ఢిల్లీ నివాసి శ్రీ యోగిఖన్నా ఆయన ధర్మపత్ని శ్రీమతి శాంతి ఆహ్వానం మేరకు సద్గురు శ్రీ నాన్నగారు మే 17న జిన్నూరులో బయలుదేరి తిరిగి జూన్ 7న వచ్చారు.

యోగిఖన్నా దంపతుల ప్రేమాభిమానాలతో జరిగిన ఈ ప్రయాణంలో అనేక విషయాలు ఆయన పరిశీలించారు. గంగానది తొలుత హిమాలయాలలో వేరువేరుపేర్లతో ప్రారంభమై దేవ ప్రయోగవద్ద గోముఖం నుండి వస్తున్న భగీరథి నది బదరీ నుండి వస్తున్న అలకనందా నది కలసి గంగానదిగా పేరు సంతరించుకొన్నాయి. ఆ ప్రాంతం సందర్శన ఒక పులకరింపు అని ఆయన తెలిపారు. రుద్ర ప్రయాగలో కేదార్‌నాథ్ నుండి వచ్చిన మందాకిని నది అలకనంద నదిలో కలిసినచోట బదరీకి కేదార్‌నాథ్‌కు వెళ్ళే మార్గాలు వేరుపడ్డాయని ఆయన తెలిపారు.

**హరిద్వార్** లో బ్రహ్మగుండంలో స్నానమాచరించి కంకేళ్ వెళ్ళి దక్షయజ్ఞం జరిగిన ప్రదేశాలు అక్కడ దేవాలయాలు సందర్శించారు. **మా** ఆనందమయి యోగిని సమాధిని కూడా సందర్శించారు.

**ఋషికేష్ :** గంగానది హిమాలయాల మధ్య కొండలలో ప్రయాణించి భూమి మీదకు చేరిన ప్రదేశం. ఇక్కడ కైలాశ ఆశ్రమంలో సంస్కృత వేద అధ్యయనం నాన్నగారికి ఆకట్టుకుంది. శివానంద, దయానంద, స్వర్గ ఆశ్రమాలు, ఆంధ్రాశ్రమం, ఆంధ్రనిర్వహణాశ్రమం, గీతామందిర్ ఋషికేష్‌లో ముఖ్యమైన ఆశ్రమాలను ఆయన బృందం సందర్శించారు. ఋషికేష్‌లో లక్ష్మణుడు అనేక సంవత్సరములు తపస్సుచేసి శివలింగమును స్థాపించారు. జ్యోతిర్మఠం ఆధ్వర్యంలో లక్ష్మణ స్వామికి ప్రత్యేక దేవాలయం నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు.

**జోషిమఠం :** ఆదిశంకరాచార్యులు జ్యోతిర్మఠాన్ని స్థాపించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్ఫటిక లింగం ఇక్కడే ఉంది.

**బదరిక ఆశ్రమం :** నరనారాయణులు తపస్సు చేసిన చోటు. చార్‌ధామ్‌లలో బదరీ ఒకటి. ఇది తపో భూమి. ఇక్కడ నారాయణ విగ్రహాన్ని నారధుడు ఉద్ధవుడు పూజించారు. నారాయణ విగ్రహాన్ని ఎవరో చెరువులో పడవేయగా ఆదిశంకరాచార్యులు స్వయంగా ఈ విగ్రహాన్ని పునరుద్ధరించారు. అక్టోబరు నుండి ఏప్రిల్ వరకు ఆరు మాసాలు దేవతల కోసం ఈ ఆలయాన్ని మూసి ఉంచుతారు. ఏప్రిల్ నుండి సెప్టెంబరు వరకు భక్తుల దర్శనం కొరకు ఈ ఆలయాన్ని తెరిచి ఉంచుతారు. నారాయణ విగ్రహాన్ని అవివాహితులుగా ఉన్న కేరళ నంబూద్రి బ్రాహ్మణులు అర్చన చేసే ఏర్పాటును ఆదిశంకరాచార్యులు ప్రారంభించారు. స్వర్గస్థులయినవారికి ఇక్కడ పిండప్రదానం చేస్తారు.